
గడ్డికీ గడ్డుకాలమే!

రైతుకు కష్టకాలం
- వేసవికాలంలో పాడి రైతుల అగచాట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- తెలంగాణ నుంచి రోలింగ్ వరిగడ్డి దిగుమతి
- పాడి ఆశాజనకంగా లేదంటున్న రైతులు



రోలింగ్ వరిగడ్డి

కంచికచర్ల : పాడి పరిశ్రమే ఆధారంగా జీవించే కుటుంబాలు అధికంగా ఉన్న నందిగామ నియోజకవర్గంలో ఈ ఏడాది పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడింది. పచ్చగడ్డి కొరత తీవ్రంగా ఉండటంతో ఎండుగడ్డిని కొనక తప్పని పరిస్థితులు నెలకొనడం పాడిరైతులకు భారంగా మారింది. దీంతో పశువులకు మేత కష్టాలు..పోషకులకు అగచాట్లు తప్పటం లేదు. పశుగ్రాసం కొరత నివారణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా నందిగామ, కంచికచర్ల ప్రాంతాల్లో పశువుల మేత దొరకడం కష్టంగా మారింది. ఇదే అదునుగా భావించిన అమ్మకందారులు ఎండుగడ్డి రేట్లు కూడా అమాంతంగా పెంచేశారు.

కనిపించని పశుగ్రాస కేంద్రాలు...
ఇప్పటికే పశువులకు మేత కరువైంది. కనీసం పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటుపై కూడా వెటర్నరీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అసలు గడ్డి పంపిణీ ఉంటుందో లేదోనన్న అనుమానాలు సైతం తలెత్తుతున్నాయి. దీనికి తోడు వెటర్నరీ ఆసుపత్రుల్లో దాణామృతం పేరిట కరువు దాణాను గతంలో పంపిణీ చేసేవారు. కానీ ఈసారి మూగజీవాలను ఆదుకునే ఎలాంటి పనులు లేకుండా పోయాయి. గతంలో ఊరూరా పశుగ్రాస క్షేత్రాల పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టేవారు. పంట సాగు చేసిన రైతుకు కిలో గడ్డికి రూపాయి చొప్పున అప్పట్లో ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఈ పథకం ఊసేలేకుండా పోయింది.

వరదలు తెచ్చిన నష్టం..
గతేడాది సెప్టెంబర్‌లో సంభవించిన భారీ వరదలకు నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో వరిపంట దెబ్బతినడం కూడా పశుగ్రాసం కొరతకు ప్రధాన కారణంగా కాగా.. మిగిలిన వరిపంటను కూడా రైతులు యంత్రాలతో కోతలు కోయించడంతో గడ్డి దిగుబడి తగ్గడానికి మరో కారణమని చెప్పవచ్చు.

ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.13వేలు..
పశుగ్రాసానికి కొరత ఏర్పడటంతో ఎండుగడ్డికి డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఎండుగడ్డి కట్ట ధర రూ.80నుంచి రూ.90 వరకు పలుకుతోంది. ఎండుగడ్డిని రవాణాకు దూరానికనుగుణంగా కిరాయి ఉంటుంది. 20కిలోమీటర్ల మేర దూరం ఉంటే రూ.2వేలు కిరాయి లేదా అంతకన్నా దూరం ఉంటే మాత్రం రూ.4వేల నుంచి రూ.5వేల వరకు చెల్లించక తప్పదు. ఎండుగడ్డిని ట్రాక్టర్‌కు లోడింగ్ కూలి రూ.2వేలు ఉంటుంది. ఇలా 100 రోలింగ్ కట్టల గడ్డి ట్రాక్టర్‌కు కిరాయితో కలిపి మొత్తం రూ.13వేలుపైనే చెల్లించాల్సి వస్తోందని పశుపోషకులు చెబుతున్నారు.

రోలింగ్ వరిగడ్డి కట్టలు దిగుమతి..
తెలంగాణ రాష్ట్రం నుంచి రోలింగ్ వరిగడ్డి కట్టల లారీలు నిత్యం పదుల సంఖ్యలో నందిగామ నియోజకవర్గానికి వస్తున్నాయి. కొందరు పశుగ్రాసం వ్యాపారులు గడ్డి లోడులను కొనుగోలు చేసి, అధిక ధరలకు పాడి రైతులకు విక్రయిస్తున్నారు. ఇలా పశుగ్రాసం కోసం అధికమొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుండటంతో పాడిరైతులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా పశుసంవర్ధకశాఖ అధికారులు, కూటమి పాలకులు స్పందించి పశువుల మేతను సబ్సిడీపై అందజేసి ఆదుకోవాలని పాడిరైతులు కోరుతున్నారు.

మేత దొరకడం లేదు..



వేసవికాలంలో పశువులకు పశుగ్రాసం దొరకడం లేదు. ఎక్కడైనా పొలాల్లో మేత మేపుతామంటే అక్కడ గడ్డి లేదు. ఎండు గడ్డి ఒక్కో కట్ట రూ. 80 నుంచి రూ. 90వరకు పలుకుతోంది. మేత లేక పాల దిగుబడి కూడా తగ్గిపోతోంది. గతంలో ఎండుగడ్డిని ప్రభుత్వం సరఫరా చేసేది ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. మూగజీవాలను చూస్తే భయమేస్తుంది.

– మర్రి వెంకటకృష్ణ పాడి రైతు, పేరకలపాడు, కంచికచర్ల మండలం

ఎండు గడ్డి పంపిణీ చేయాలి...



పాడి పశువులను పదేళ్లుగా మేపుతూ ఉన్నా. పశువులు పాలు బాగా ఇవ్వాలంటే వాటికి పచ్చిమేత, ఎండుగడ్డి, గానుగ పిండి కావాలి. వాటి ధరలు చూస్తే భగ్గుమంటున్నాయి. ఇక ఎండుగడ్డి ధరలు పెరిగాయి. ఇంత చేసి కొన్నా పాల ధరకు సరైన గిట్టుబాటు ధర లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక ఎండుగడ్డి పంపిణీ కూడా లేకుండా పోయింది. మూగజీవాల పోషణ కష్టంగా ఉంది.

– జినిగొర్ల నరసింహారావు పశుపోషకుడు పెండ్యాల, కంచికచర్ల మండలం

క్లుప్తంగా

మోదుగులను కలిసిన తన్నీరు



జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్‌సీపీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పార్లమెంటు పరిశీలకుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డిని శుక్రవారం గుంటూరులో ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మోదుగులను కలిసి అభినందనలు తెలిపిన వారిలో ఆపార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, పేట మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, పారిశ్రామికవేత్త మట్టా ప్రతాపరెడ్డి ఉన్నారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం బాపట్ల జిల్లా చుండూరు మండలం ఆలపాడు గ్రామానికి చెందిన గంటా సుబ్బారావు, పద్మావతి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు వారు నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ మన్నె నర్సయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఎస్టీఓ కార్యాలయం తనిఖీ



జగ్గయ్యపేట: పట్టణంలోని సబ్‌ట్రెజరీ (ఎస్టీఓ) కార్యాలయాన్ని జిల్లా ఖజానా అధికారి ఏ.రవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. అనంతరం ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట, నందిగామ ఎస్టీఓలు ప్రఫుల్లా కుమార్, కాకాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గంలోని అధికారులు స్వర్ణాంధ్ర -2047పై ఆచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047 ఆచరణ ప్రణాళికలపై నియోజకవర్గంలోని ఆయా మండలస్థాయి అధికారులతో యోజకవర్గ ప్రత్యేకాధికారి జి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే తాతయ్య పాల్గొని వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. ఆచరణ ప్రణాళికలపై ప్రత్యేక రిపోర్టును సిద్ధం చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ ఎం.రామ్మోహనరావు, ఎంపీడీఓలు జి.నితిన్, ఎస్.రాంబాబు, జి.శ్రీను, జగ్గయ్యపేట ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, నందిగామ తహసీల్దార్ కె.సురేష్ బాబు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన



జగ్గయ్యపేట: మండలంలోని జయంతిపురం, వేదాద్రి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను శుక్రవారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పరిశీలించారు. ఈసందర్భంగా వేదాద్రిలోని సర్వే నెంబర్ 221, జయంతిపురంలోని సర్వే నెంబర్ 95లోని ఏపీఐఐసీ భూములతోపాటు 65వ సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూములు పరిశీలించారు. ఆయా భూములకు సంబంధించిన వివరాలను సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, ఇన్‌చార్జి తహశీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, సర్వేయర్ అనూష్ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

నందిగామరూరల్: పల్లగిరి గట్టుపై వేంచేసియున్న రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 11న స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు నరసింహారావు, కొత్త వేణుమాధవ్, వెంకట రమణ తెలిపారు.

భారత్ సైన్యానికి మద్దతుగా ర్యాలీ



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను మట్టుపెడుతున్న భారత సైన్యానికి అందరూ అండగా నిలవాలంటూ చిల్లకల్లు పోలీసుల ఆధ్వర్యంలో షేర్‌మహ్మద్‌పేటలో శుక్రవారం సాయంత్రం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుపెడుతోందన్నారు. నంతరం ఉగ్రవాదుల దాడుల్లో వీర మరణం పొందిన భారత సైనికులు, తెలుగు రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్, చిల్లకల్లు ఎస్సై తోట సూర్య శ్రీనివాస్, అన్నిపార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం



ఉలవలపూడి వినయ్‌కుమార్

కంచికచర్ల: ఆడుకుంటూ బయటకు వెళ్లిన ఓ చిన్నారి కనిపించకుండాపోయిన సంఘటన శుక్రవారం కంచికచర్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..కంచికచర్ల అరుంధతీనగర్‌కు చెందిన ఉలవలపూడి వినయ్‌కుమార్(7) శుక్రవారం 3 గంటల సమయంలో ఇంటి బయట ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. కుటుంబసభ్యులు పరిసరప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.రాజు తెలిపారు. బాలుడి ఆచూకీ కనుగొనేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

వైభవంగా శేషవాహన సేవ

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహస్వామి తిరుకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రువారం రాత్రి శేషవాహనసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను శేషవాహనంపై ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అర్చకులు శాస్త్రోత్తంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీధరాచార్యులు, వాసుదేవాచార్యులు, ఈఓ సురేష్‌బాబు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహ తొలగింపు యత్నం
కక్షపూరితమే

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు

నందిగామటౌన్: కూటమి నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తూ స్థానిక గాంధీసెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ తొలగింపునకు యత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించవద్దని కోరుతూ శుక్రవారం రాత్రి ఆయన మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేందుకు నిర్వహించాల్సిన అత్యవసర సమావేశాలను ఇలాంటి కక్షపూరిత చర్యలకు వినియోగించడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఉదయం పూట అయితే కోర్టును ఆశ్రయించి విగ్రహ తొలగింపును అడ్డుకుంటామనే ఉద్దేశంతో కోర్టు సెలవుల సమయంలో అది కూడా కార్యాలయ పని వేళలు ముగిసిన తరువాత మున్సిపల్ సమావేశం పెట్టి అక్రమంగా తీర్మానం చేశారని మండిపడ్డారు.

హైకోర్టు స్పష్టంగా చెప్పినా...
అభివృద్ధిలో బాగంగానే తమ హయాంలో గాంధీ సెంటరులో అస్తవ్యస్థంగా ఉన్న విగ్రహాలను ఒక క్రమ పద్ధతిలో ఏర్పాటు చేశామని జగన్‌మోహనరావు తెలిపారు. అన్ని పార్టీల నాయకులతో మాట్లాడిన తరువాతనే విగ్రహాల స్థలాలను మార్పు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆసమయంలో కూడా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉన్నందున ట్రాఫిక్‌తోపాటు మరే ఇతర అంతరాయం లేదని పిటీషనర్ చెప్పిన ప్రకారమే విగ్రహాన్ని తీయాల్సినవరం లేదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అభివృద్ధి పనులు చేపట్టకుండా ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. ట్రాఫిక్‌కు అంతరాయం అనే పేరుతో వైఎస్ విగ్రహ తొలగింపు చర్యలకు పూనుకోవడం తగదన్నారు.

హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, కౌన్సిలర్లు షేక్ యాకుబ్ అలీ, షేక్ ఖాలిక్, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మంచాల చంద్రశేఖర్, ఆవుల రమేష్‌బాబు, నాయకులు కోటేరు ముత్తారెడ్డి, నెలకుదిటి శివనాగేశ్వరరావు, షేక్ జాఫర్, కరి రవీంద్ర, నల్లమల్లి మురళి, మువ్వల శ్రీను, పోతురాజు, స్టాలిన్, వేల్పుల రాము, చింతోటి ప్రసాద్, రామిరెడ్డి శీతయ్య, ఓర్సు కొండ,, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు



పెనుగంచిప్రోలులో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

వత్సవాయి: బాల్య వివాహల కారణంగా తలెత్తే అనేక అనర్థాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బీబీజాన్ సూచించారు మండలంలోని భీమవరం, మక్కపేట, వత్సవాయి, మంగొల్లు, పెద్దమోదుగపల్లి, గోపినేనిపాలెం గ్రామాలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికల్లో వ్యక్తిత్వ వికాసానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కిశోర బాలికలు చదువుపై దృష్టి సారించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా ఆడా, మగా అనే బేధం లేకుండా బాలబాలికలను తప్పకుండా చదివించాలన్నారు. బాల్య వివాహాల కారణంగా తలెత్తే ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...
అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత అని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి బాలికలు, వారి తల్లులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, నాగమణి, విమల, జయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై బాలికల తల్లులకు అవగాహన కల్పించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా పేట కబేళా

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



కట్టెల అడితిగా మారిన కబేళా

జగ్గయ్యపేట అర్బన్ : పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన కబేళా(జంతువధశాల) నిరుపయోగంగా మారింది. పాలకవర్గాల నిర్లక్ష్యానికి గురైన ఈ కబేళా ప్రస్తుతం తాగుబోతులకు ఆవాసంగా మారింది. ఇక్కడ సరైన వసతులు కల్పించకపోవడంతో మాంసం వ్యాపారులు పోలీస్ క్వార్టర్స్ వద్ద ఉన్న మార్కెట్ వద్దనే మేకలు, గొర్రెలను వధిస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో మార్కెట్‌ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు.


కనీస వసతులు శూన్యం..
జంతువధ సమయంలో వ్యర్థాలను శుభ్రపరిచేందుకు అవసరమైన నీరు కబేళాలో అందుబాటులో లేదు. ఇక విద్యుత్ సదుపాయం కూడా కల్పించలేదు. కబేళాకు నీరు, విద్యుత్ సదుపాయం కల్పించడంలో దశాబ్దకాలంగా మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు. తెల్లవారుజాము నుంచే జంతువధలు మొదలవుతుండటంతో చీకట్లో ఈ పనులు చేయలేక, మంచినీటి వసతి సైతం లేకపోవడంతో వ్యాపారులు మార్కెట్ ప్రాంతంలోనే జంతువధలు చేస్తున్నారు. దీంతో కబేళా నిరుపయోగంగా మారింది.

అసాంఘిక కార్యక్రమాలకు ఆవాసం..
లక్షలాది రూపాయలతో నిర్మించిన ఈ కబేళాను వినియోగంలోకి తెచ్చే విషయంలో మున్సిపల్ పాలకులు, అధికారులు దశాబ్దకాలంగా తీవ్ర నిర్లక్ష్యంతోనే వ్యహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఈ కబేళా అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారింది. పలువురు తమ వంట చెరకు, కలపను ఇక్కడే నిల్వ చేసుకుంటున్నారు. పగటి పూట కొందరు పేకాట ఆడుతుండగా, రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం సేవించినవారు ఇక్కడే గొడవలకు పాల్పడుతుండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టడంతోపాటు కబేళాను వినియోగంలోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మందుబాబులు వదిలేసిన మద్యంసీసా, గ్లాసులు


అధికారులు చర్యలు తీసుకోవాలి...



పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న కబేళాను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ కబేళా పగలు పేకాట ఆడేవారికి, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మున్సిపల్ అధికారులు స్పందించి కబేళాను వినియోగంలోకి తీసుకురావాలి.

– లంకపల్లి రవిప్రసాద్, సామాజిక కార్యకర్త, డాంగేనగర్

కబేళాను వినియోగంలోకి తెస్తాం..



కబేళా వద్ద నిఘా ఏర్పాటు చేసి పేకాట, అసాంఘీక కార్యక్రమాలు సాగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. అవసరమైన చర్యలు తీసుకుని కబేళాకి నీరు, విద్యుత్ సదుపాయం కల్పించి వినియోగంలోకి తెసుకువస్తాం.

– ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్, జగ్గయ్యపేట.

కుట్టుమిషన్ల స్కాంపై విచారణకు డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న మార్త శ్రీనివాసరావు, జవ్వాజి నరసింహారావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: బీసీ మహిళలకు కుట్టుశిక్షణ, మిషన్ల పంపిణీ వ్యవహారంలో కూటమి ప్రభుత్వంలో రూ.157 కోట్ల దోపిడీకి తెరతీసిందని, ఈ విషయంపై నిష్పక్షపాత విచారణకు ప్రభుత్వం సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు డిమాండ్ చేస్తూ ఆ పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు, పేట నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు, నరసింహారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో లక్ష మంది బీసీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ, శిక్షణ నిమిత్తం ఒక్కొక్క మహిళకు రూ.23 వేల చొప్పున రూ 230 కోట్లు కేటాయించారన్నారు. అయితే ఒక్కో కుట్టు మిషన్ ఖరీదు రూ.4,300 ఉండగా, శిక్షణకు రూ.3వేలు కలిపి మొత్తం రూ 7,300 మాత్రమే ఖర్చవుతోందని వివరించారు. కానీ కూటమి ప్రభుత్వంలో వారి సొంత కాంట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని, ఒక్కొక్క లబ్ధిదారు పేరుతో రూ.15,700 దోచుకుంటున్నారని విమర్శించారు. ఇలా మొత్తం బీసీమహిళల పేరుతో రూ.157 కోట్లు దోపిడీ చేస్తున్నారన్నారు. నిష్పక్ష విచారణకు సిద్ధమై బీసీ మహిళల సొమ్ము స్వాహా కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ మేరకు వినతిపత్రంలో అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు సతమతం



పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో వాహనాల రద్దీ



మునేరు అవతల పెద్ద వాహనాల ఇబ్బందులు

పెనుగంచిప్రోలు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు సతమమతం అవుతున్నారు. ఉన్న కొద్దిపాటి రోడ్లు కూడా ఆక్రమణలకు గురికావడంతో ట్రాఫిక్ అవస్థలు తప్పడం లేదు. యాత్రా స్థలం కావడంతో నిత్యం వందల సంఖ్యల వాహనాలు రాకపోకలు సాగిస్తుండటం వాహనాల రద్దీ రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ క్రమంలో వత్సవాయి మండలం లింగాల కాజ్‌వే మరమ్మతుల నేపథ్యంలో తెలంగాణలోని వైరా వైపు నుంచి రాకపోకలు సాగించే వాహనాలను పెనుగంచిప్రోలు మీదుగా మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. వాహనాల రద్దీ కారణంగా గ్రామంలో రోడ్డుపైకి రావాలంటేనే ప్రజలు హడలెత్తి పోతున్నారు. మునేరు అవతల పెద్దపెద్ద లారీలు మలుపులో తిరగక పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి పోతున్నాయి. శుక్ర, ఆదివారాల్లో శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఈ ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. సమస్య నివారణకు మునేరు అవతల, పోలీస్‌స్టేషన్ సెంటర్ వద్ద పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు



కంచికచర్ల: మండలంలోని పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కిల్కారి ప్రోగ్రామ్ అధికారి రాజు, డీసీఎం హరీష్ శుక్రవారం సందర్శించారు.స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎం, ఆశకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న కిల్కారి మొబైల్ సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు వారి వివరాలను స్థానిక పీహెచ్‌సీ, ఏఎన్ఎం వద్ద నమోదు చేసుకుంటే వారికి ఈ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు.కార్యక్రమంలో డాక్టర్ పవన్‌నరేంద్రవర్మ, షేక్ దస్తగిరి, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.